# జ్ఞానధార - దానధార

హయగ్రీవం ఇంత పెద్ద ప్రయాణం ఎప్పుడూ చేయలేదు.

చీకటి పడింది. రైలు బోగీలో దీపాలు వెలిగాయి. ఎగిరిపోయే అయిదు పక్షుల తత్వాలు పాడిన బిచ్చగాడు, బూట్లకు పాలీషు కొట్టే చింపిరిజుట్టు పిల్లవాడు, రాజమండ్రి జామకాయలమ్మిన లుంగీ సాయిబూ—అందరూ దిగిపోయారు. కొంచెంసేపట్లో తోటి ప్రయాణీకులు టిఫిన్ కారియర్లు, అన్నం డబ్బాలు, రొట్టెల పొట్లాలు తెరిచి తింటూనే రాచకీయాలు, మెట్టవేదాంతం, సినిమా కబుర్లు చెప్పుకోవడం కూడా అయిపోతున్నది. ఇక చుట్టలవాళ్ళు, సిగరెట్లవాళ్ళు కూడా వాళ్ళ యజ్ఞాన్ని ముగించేసరికి పది గంటలు కొట్టారు. ఆడా, మగా పై బెర్తులు, మధ్య బెర్తులూ దులుపుకుంటూ, రెపరెపలాడే దుప్పట్లని పరుచుకుంటూ ఇక నిద్రకు కూడా ఉపక్రమించారు.

గుండెలో అదురుతో, మనసులో దిగులుతో నిద్రరాక, చిరంజీవి మాస్టారు తనకూ, భార్య శ్రీలక్ష్మికి, కొడుకు బుజ్జిగాడికీ మూడు బెర్తులు రిజర్వు చేయించినా, తను బుజ్జిగాడి కాళ్ళకట్టనే ఒదిగి ఒదిగి కూర్చు న్నాడు హయగ్రీవం.

తమ్ముడికి రాసిన ఉత్తరం అంది ఉంటుందా? సారథి స్టేషన్‌కు వస్తాడా? రాకపోతే? గుంటూరు, బాపట్ల, తెనాలి, పొన్నూరు, చీరాల, విజయవాడ పట్నాలు తప్పితే దేశం ఎరగని తను, ఆ మహానగరంలో తమ్ముడి ఇల్లు ఎట్లా వెదకగలడు భార్యాబిడ్డలను వెంటవేసుకొని? డాక్టరు సారథి అంటే చెబుతారా? ఆంధ్ర రాజధాని అయినా అక్కడ ఉర్దూ రాకపోతే నానా యాతనా పడాలని అంటుంటారే? ద్వంద్వాలోచన లతో హయగ్రీవం ఆందోళనలు ఇంకా ఇంకా వెనక్కిపోతున్నాయి అతని నిద్రలాగానే. ఎంత తెలివితక్కువతనం కాకపోతే శ్రీలక్ష్మి అంటున్నా తను మేనల్లుడు దత్తాత్రేయుడికి గూడా ఎందుకు రాయటం మరచిపోయాడు?

* * *

దాదాపు పదిహేనేళ్ళ క్రితం మాట.

మిట్టమధ్యాహ్నం. తను చోపుదారి మాన్యం మెరకమడి దుక్కి దున్నిస్తుండగా, ఎన్నడూ పొలం ముఖం కూడా చూడని తమ్ముడు గట్టుమీది మర్రివృక్షం నీడలో నిలబడి ఉండటం గమనించాడు.

తను చెయ్యెత్తి పిలిచాడు. కాని, సారథి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ వచ్చాడు. ఇంటి దగ్గర ఏమన్నా అత్యవసరం వచ్చిందేమోనని తను గాభరాపడ్డాడు. సారథి ముఖంలో మాత్రం ఆ చాయ లేకపోవడం చూసి తను ఆదుర్దా దిగమింగి "ఏం పార్థూ?" అని ప్రశ్నించాడు.

"నేను ఇంటర్ పాసయ్యానన్నయ్యా."

"శుభం!"

"ఫస్టుక్లాసు."

"చెన్న కేశవుడి దయ. చిరంజీవి మాస్టారు ముందే ఆశీర్వదించాడుగా! కష్టపడ్డావు. ఫలితం దక్కింది—మంచిది" అని తను మళ్ళీ మడిగట్టు దాటబోతున్నా పార్థసారథి కదల్లేదు. సందేహిస్తూ తన వంకే చూస్తున్నాడు. తన హృదయం కరిగిపోయి — "ఏం బాబూ" అని తమ్ముడి వదనం వంక పరికించి చూచాడు.

"అదిగాదన్నయ్యా...."

"చెప్పు - సందేహించకు.

"నేనూ, కోనావారి అంజీ మెడికల్ కాలేజీ అప్లికేషన్లు తెచ్చుకొందామనుకొన్నాం అన్నయ్యా"

గుండె ఝల్లుమంది.

"అంటే— డాక్టరీకా...."

"ఊఁ...."

"అయిదేళ్ళా?"

"ఇంకో సంవత్సరం హౌస్ సర్జన్సీ అని ట్రైనింగు ఉంటుంది. అప్పుడు కొంత స్టైపండు కూడా ఇస్తారు."

నాన్న—వాడి పసితనంలోనే గతించాడు. అమ్మ తన అంత్యదశలో వాణ్ణి శ్రీలక్ష్మికీ, తనకూ అప్పగించి తృప్తినిండిన హృదయంతో కళ్ళు మూసిన నాటి నుంచీ ఏ కొరతా చేయలేదు. శ్రీలక్ష్మి వాడిని తన పెద్దబిడ్డగా పెంచింది. ఇప్పుడా సందేహించటం? కుటుంబానికి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు తరువాత మిగిలిన రెండెకరాల మాగాణి పొలం, నాలుగు తరాలుగా వస్తున్న దేవుడి చోపుదారి మాన్యంతో సంసారం ఒడిదుడుకులు లేకుండానే గడిచింది. వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు బొటాబొటిగా సరిపోతున్నా, ఆ చెన్నకేశవుడి కరుణవల్ల తనే అప్పూ చేయలేదు. ఇక ఆలోచించకుండా "సరే అప్లికేషన్లు తెచ్చుకో. వదినెనడిగి ఖర్చులకు డబ్బు తీసుకో" అన్నాడు.

అట్లా వచ్చింది—పార్థుడికి డాక్టరీ సీటు. సీటైతే వచ్చింది గాని అది విశాఖపట్నం కాలేజీలో. కలవారి అబ్బాయి కోనా అంజికి మాత్రం గుంటూరులోనే దొరికింది.

హయగ్రీవానికి కళ్ళు మూతలుపడి ఒక చిన్న కునుకుపట్టింది. బుజ్జిగాడిని అసింటా జరిపి ఒదిగి పడుకుంటూ 'ఏమిటీ ద్వంద్వాలోచనలు, ఏమిటీ భయాందోళనలు' అని ఆశ్చర్యపోయాడు. తండ్రి పాదాల ముందు కూర్చొని, మానవుడంటే ద్వంద్వాలోచలను తరిమివేసి, తనను తాను జయించుకొన్నవాడేనని ఎన్నో పాఠాలు నేర్చుకొని ఇప్పుడవన్నీ విస్మరించాను కాబోలు ననుకొన్నాడు. ఈ విశ్లేషణ అర్థం కాగానే మళ్ళీ జాగ్రదవస్థ వచ్చింది. నిద్ర దూరం కావటం, ఆలోచనా ధోరణి సాగిపోతూండటం అతనికి తెలియలేదు.

*　　　　*　　　　*

ఈ పసివాణ్ణి ముక్కూ ముఖం తెలీని విశాఖ పంపటమా? అత్యవసరంగా మూడు, నాలుగు వేల డబ్బు ఎక్కడ పుట్టించటం? ఇష్టదైవాన్ని ప్రార్థనాపూర్వకంగా వేడుకొంటూండగా చిరంజీవి మాస్టారు వచ్చి భుజం తట్టి చెప్పాడు.

"సందేహించవద్దు. ఖర్చు కొంచెం ఎక్కువే మరి! రేపు తను సంపాదించి ఏదైనా అప్పు పడితే తీర్చుకోడా? అయినా అతని భాగం పొలం ఉన్నదిగాని అన్నగారే లోభం చూపించాడని లోకులనరా? మా మామగారితో మాట్లాడి ఉంచాను. ప్రస్తుతానికి ఆయన డబ్బు సర్దగలడు."

పార్థసారథిని వెంట తీసుకొని మరునాడే చిరంజీవి మామగారిని చూడటానికి వెళ్ళాడు. రామకోటి రాసుకొంటూన్న ఆయన ముందు మూడు వేల రూపాయలకు రాసిన ప్రామిసరీ నోటు ఉంచాడు. మణేదారు వెంకటప్పయ్యగారు సిరాబుడ్డిలో ముంచుతున్న కలం ఒక పక్కకు పెట్టి, రామకోటి పుస్తకాన్ని కళ్ళకద్దుకొని మూసేస్తూ పార్థుడి వంక తిరిగి "మీ తండ్రిగారి పేరు నిలుపు. ఆయుర్వేదాన్నే ప్రథమ

వేదంగా ఈ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఆరోగ్యభిక్ష పెట్టాడు మహానుభావుడు. మళ్ళీ నీ రూపంలో ఆయన నాకు కనిపిస్తున్నాడయ్యా." అని లోపలికి పోయివచ్చి డబ్బు వాడి చేతికే ఇస్తూ "ఈ నోటు అక్కర లేదు. చదివి సంపాదించుకొని తిరిగి ఇద్దువుగాని" అని మళ్ళీ రామకోటి పుస్తకం తెరిచాడు.

* * *

విశాఖలో చదువుకు ఖర్చు బాగానే అయింది. జీతాలు, హాస్టలు ఛార్జీలు, పుస్తకాలు, సూట్లు అంటూ ఉత్తరాలు వస్తూనే ఉండేవి. మొదట్లో పిత్రార్జితంగా సంక్రమించిన రెండెకరాల మాగాణి భూమిని తనఖా దస్తావేజు రాయగా ముట్టిన పైకాన్ని సర్ది మూడేళ్ళ చదువూ అయిందనిపించాడు. నాలుగో ఏటనే చాలా కటకటపడటం, తనఖా దారుకే ఎకరం పొలం విక్రయపత్రం దాఖలు చేయటం, ఆ డబ్బును తమ్ముడికి పూర్తిగా పంపుతూ, జాగ్రత్తగా ఖర్చులు పెట్టుకోమని జాబు రాస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంటే శ్రీలక్ష్మి ధైర్యం చెప్పటం, తెల్లవారు జామున కునుకు మళ్ళీ పట్టబోయే ముందు హయగ్రీవం స్మృతికి తెచ్చుకొన్నాడు.

* * *

రాత్రి తల్లి ఒడిలో తనకు ప్రశాంతత లభించకపోయినా, తరతరాల సాత్విక ధర్మపాలనలో అలవడ్డ ప్రశాంతతతోనే హయగ్రీవానికి బ్రాహ్మీముహూర్తంలోనే మెలకువ వచ్చింది. ప్రభాతే కరదర్శనమ్— అని అరచేతిని కళ్ళకద్దుకొన్నాడు. గజేంద్రమోక్షంలోని భాగవత పద్యాలను చదువుకొని కాలకృత్యాలు తీర్చుకొంటూండగానే బోగీ అంతా ఒళ్ళు విరుచుకొంటూ కలకలమంటున్నది. శ్రీలక్ష్మి బుజ్జిగాణ్ణి లేపుతూంది. ఇంజన్ చివరి కూత కూసింది. హైదరాబాద్ నాంపల్లి స్టేషన్లో బండి ఆగిందని అతను గ్రహించాడు.

అప్పటిదాకా దిగాలుపడి కూర్చున్న బుజ్జిగాడు "నాన్నా—

నాన్నా!" అని అరుస్తున్నాడు. నిన్నటి నుంచీ ఒక్క పర్యాయం కూడా నోరు మెదపని శ్రీలక్ష్మి "ఏమండీ వచ్చేశామా?" అని ప్రశ్నిస్తున్నది. హాయగ్రీవం కిటికీ గుండా ప్లాటుఫారం మీదికి తొంగి చూశాడు. ఆగి పోయిన బోగీకెదురుగా ఒడ్డూ, పొడుగూ, హుందాగల తమ్ముడు దొర బాబులాగా, అతని కుడిపక్కగా చేతుల్లేని బ్లౌజు, కళ్ళద్దాలతో అప్సరస లాగా మరదలు, వాళ్ళ చెరివక చేతిని పట్టుకొని గంధర్వ కన్యల్లాంటి బాబూ, పాపా! హాయగ్రీవం పొంగివస్తూన్న ఆనందబాష్పాలను తుడుచుకొంటూ, గతరాత్రి అనుమానాలకు సిగ్గుపడుతూ 'భగవాన్ దయామయా!' అనుకొన్నాడు.

కాశీబోసి కట్టిన గుంటూరు చేత చీర, కాళ్ళకు బోలు కడియాలు, మెళ్ళో పసుపుతాడు, చేతిలో పాత ట్రంకు పెట్టె—శ్రీలక్ష్మి బండి దిగి చిరునవ్వుతో బిక్కుబిక్కుమంటూ తోడికోడలిని పలకరిస్తున్నది. తల్లి పమిటచెంగు పట్టుకొని వెనకెనకే దాగుతూ బుజ్జిగాడు. వాణ్ణి వింతగా చూస్తూ తమ్ముడి బిడ్డలు రాకేష్, అలకా. రెండు విభిన్న గోళాలు అకస్మాత్తుగా ఎదురుపడినట్లు హయగ్రీవానికి తోచింది. 'బాబాయిరా, బాబాయ్'— అని తను బుజ్జిగాడికి చూపుతున్నాడు. నీరుకావి ధోవతి మీద ఆ ఫారం వేసుకొన్న పెదనాన్నకు పిల్లలిద్దరినీ పరిచయం చేశాడు పార్థు. స్టేషన్ బయటకు రాగానే తమ్ముడు చేయి ఊపటం, డ్రైవరు కారు తెచ్చి నిలిపి తలుపులు తెరవటం, పావుగంటలో రెండతస్తుల భవనం ముందు దిగటం—అంతా సినిమాలో సీనులాగా జరిగిపోయింది. హయగ్రీవానికి మళ్ళీ ఆనందబాష్పాలు. తన తమ్ముడా? ఇంత ప్రయోజకుడైనాడా?

* * *

స్నానాల గదిలో గీజర్ ఆన్ చేసి చూసి వెళ్ళిపోతున్న పని పిల్ల వాడిని ఆపి— "వద్దు. నేను చన్నీళ్ళు చేస్తాను" అన్నాడు హయగ్రీవం.

స్వగ్రామంలో ముందు వసారా అంత విస్తీర్ణంలో ఉంది ఆ గది.

పింగాణి పెంకులు, వెన్నెలంత తెల్లనివి. ఆ హాయిలో తన్మయత్వం చెందుతూ నీళ్ళు పోసుకొంటూంటే, మళ్ళీ తెగిపోయిన ఆలోచనలు తేనె పట్టును వదిలిపోతున్న పోతుటీగల్లాగా మనసును ముట్టడించసాగాయి.

వాడి చదువు పూర్తవుతున్నది—అని తృప్తిగా నిట్టూర్పు విడవవలసిన సమయంలో ఉత్తరాలు తగ్గిపోయాయి! ఎందుకు రాయటంలేదు? ఆరోగ్యంగా ఉంటున్నావా? పరీక్షలేమన్నా పోయినాయా? దిగులు పడకు. అన్నీ చక్కబడతవి. డబ్బు పంపమంటావా? ఎంత? అని తనే వారం వారం జాబులు రాశాడు. మూడిటికీ కలిపి ఒక్క కార్డు ముక్క తిరుగు జవాబు. 'ఏమీ అక్కర్లేదు. హౌస్ సర్జన్సీలో ఉన్నాను.'

ఆ తరువాతనే అన్నీ విచిత్ర సంఘటనలు. సీమలో ఏదో ఆస్పత్రిలో స్కాలర్‌షిప్పు దొరికిందని రాశాడు. ఇంటికి రాకుండానే స్కాట్లెండులో ఎడింబరో చేరి ఒక టెలిగ్రామ్ కొట్టాడు. అక్కడ రెండేళ్ళ సర్జరీ కోర్సు. ఆరు నెలల కో సారి క్షేమం అని తంతి. తిరిగి దేశం వచ్చాక, విశాఖలోనే వాళ్ళ ప్రొఫెసరు వర్మగారి పెద్ద కుమార్తెతో వివాహం నిశ్చయించుకొన్నాననీ, అన్నయ్యను ఏమీ అనుకో వద్దనీ చిరంజీవి మాస్టారుకు పది వాక్యాల ఉత్తరం. ముహూర్తం వివరాలు మినహాయించి తనను వెంటనే బయలుదేరి రమ్మని వచ్చిన తంతిని ఎవరికీ చూపలేదు. డబ్బుకోసం ప్రయత్నించాడు. దేవుడి కళ్యాణం. డబ్బు పుట్టక తిరిగి తంతి ఇవ్వాలని ఆత్రుతపడితే — చిరునామాయే లేదు.

చెన్నకేశవుడి కల్యాణోత్సవంలో రథం ముందు వెండిపొన్ను కర్రను భక్తితో పట్టుకొని చోపుదారుగా నడుస్తుంటే తను లేకుండా తన తమ్ముడి కల్యాణమా? అని ఆకాశవాణి పలకరిస్తున్నట్లుగా తోచి, ఉత్సవ విగ్రహాలను మసకబారిన చూపుతోనే దర్శించి క్షమాపణ కోరుకొన్నది మొన్నమొన్ననే కనిపించింది.

ఆ తరువాత మూడు నెలలకు కాబోలు మణిదారు వెంకటప్పయ్యగారు పిలిపించింది.

"తమ్ముడి ఉత్తరం వచ్చింది. చూడు."

చదివాడు: 'మీ బాకీ నేనే వచ్చి తీరుస్తాను. అన్నయ్యా నేమీ తొందర చేయవద్దు. ప్రస్తుతం నేను హైదరాబాదులో ప్రాక్టీసు ప్రారంభించాను.'

"నేనేమైనా నిన్ను తొందర పెట్టనయ్యా? ఏమిటీ రాతలు? గుంటూరు వచ్చి బోర్డు పెట్టవలసినవాడు ఎందుకంత దూరం పోవటం! తాపత్రయం. మీ నాన్న అబ్దికానికి రమ్మని రాయి."

తనట్లాగే రాశాడు. పార్థుడు రాలేదు. మళ్ళీ అమ్మ శ్రాద్ధానికీ రాశాడు. ఈమాటు వంద రూపాయల మనీఆర్డరు వచ్చింది. అన్నదమ్ము లిద్దరూ కలిసి మాతృయజ్ఞం అరకొరలన్నీ పూర్తి చేయాలన్న తన మనోవాంఛ అట్లాగే ఉండిపోయింది. సారథికి మంచి పేరు వచ్చిందనీ, గుండె ఆపరేషన్లు కూడా చేస్తాడని చిరంజీవి తన ముఖం చూడకుండా, ఇతరులకు చెబుతున్నప్పుడు విని, శ్రీలక్ష్మితో ఆ మాటలే వల్లించి సంతోషపడ్డప్పుడు, తమ్ముడు ఏమి దోషం చేశాడని తన మనసులో కొరత అనిపించేది.

మరుసటి సంవత్సరం కారులో ఒంటరిగా వచ్చి, మణియదారు గారి అప్పు తీర్చి, ఆయనకు హైదరాబాదు మార్వాడీ మిఠాయిపెట్టెలు, పళ్ళ బుట్ట ఇచ్చి, మరిన్ని ఇంట్లో వదినెకూ,పిల్లలకూఇచ్చి సాయంత్రమే ప్రయాణం అవుతూంటే శ్రీలక్ష్మి కల్పించుకొని అడగటం తను విన్నాడు—"మరదల్నీ, పిల్లవాణ్ణీ ఎప్పుడు చూపిస్తావయ్యా మరిదీ?" అని.

చిరునవ్వు—"ఈమాటు."

"గోడమీద రాసుకోమంటావా?"

మళ్ళీ చిరునవ్వు. తన పెద్ద కూతురు వసంత బాబాయి కారును తన నేస్తురాళ్ళకు గర్వంతో చూపిస్తున్నప్పుడు తలమీద నిమిరి చేతిలో

వంద రూపాయల నోటు పెట్టి కారు స్టార్టుచేసినప్పుడుకూడా తనమనసులో సంగతులు తమ్ముడితో చెప్పలేకపోయాడు. ఏమున్నాయి మనసులో? వసంత పెళ్ళీడుకొచ్చిందనా? బుజ్జిగాడికి చదువబ్బక ప్రతి క్లాసులోనూ తప్పుతున్నాడనా? ఇంటి పడమటి గోడ మొన్నటి గాలివానకు పడిపోతే, చేతిలో ఏమీ మెసలక మరమ్మతులు చేయించలేకపోయాననా?

శ్రీలక్ష్మి స్నానాల గది తలుపు తట్టింది. తను ఉలిక్కిపడి తలుపు తీసి—"వసంత దిగులుపడకుండా ఉంటుందంటావా?" అని ఎందుకో అన్నాడు.

వసంతను చిరంజీవి భార్య చూచుకొంటాననంటే అక్కడే వదిలి వచ్చారు.

"ఒక కార్డు రాసేద్దురూ. పిచ్చిమొద్దు దిగులుపడుతుందేమో! ఇంత సేపూ ఇదా మీ ఆలోచన?" అని శ్రీలక్ష్మి ఆశ్చర్యపడ్డది.

ధావళీ కట్టుకొని కృష్ణాజినం పరుచుకొని తను ప్రాణాయామానికి కూర్చోబోతుంటే— "ఇదేమిటి పెదనాన్నా?" అని రాకేష్ కళ్ళు పెద్దవి చేసుకొని అడిగాడు.

"ఇది జింకచర్మం."

"ఎందుకూ?"

"ఇది మా నాన్నగారు—అంటే మీ అందరికీ తాతయ్య-నా కిచ్చి పోయారు. దీనిమీద ఆసీనమైగాని ధ్యానం చేసుకోగూడదు."

తను జలధౌతి ఆచరిస్తుంటే పిల్లలిద్దరూ ఎదురుగా కూచొని ఆశ్చర్యంగా చూస్తూనే ఉన్నారు. ఒక ముక్కుపుటం మూసి రెండో ముక్కుతో పెద్దచెంచాడు నీళ్ళన్నీ లోపలికి పీల్చి మళ్ళీ మూసినముక్కు నుంచి వెడలగక్కటం—తన స్నేహితులకు చూపటానికి రాకేష్ వెళుతుంటే వాళ్ళమ్మే వారించింది. "తప్పు, వాళ్ళు పల్లెటూరివాళ్ళు. అట్లాగే యోగాభ్యాసాలు చేస్తుంటారు."

"ఎందుకని?"

"వాళ్ళకు మన మాదిరిగా మందులు దొరకవు" అని ఆమె సమాధానం చెప్పింది. కాని, వాడికి ఈ జవాబు సంతృప్తి నివ్వలేదు. బుజ్జిగాణ్ణి కూడా ప్రశ్నించి చూశాడు. వాడు వట్టి దద్దమ్మ. కళ్ళు మిటకరించి "ఏమో నాకు తెలియదు" అన్నాడు.

ఆ ఉదయమే దత్తాత్రేయుడు—మేనల్లుడు వచ్చాడు. వాడికింకా పెళ్ళి కాలేదు. గవర్నమెంటు శాఖలో దేంట్లోనో చిన్న ఉద్యోగం చేసుకొంటున్నాడు. వాడు ఉంటున్న పేట చాలా దూరం. హయగ్రీవానికీ, శ్రీలక్ష్మికీ వాణ్ణి చూడగానే జన్మభూమి నుంచి మనుషులు వచ్చినట్లే ఉండి ఉప్పొంగిపోయారు. కాని, పార్థు, మరదలు అంత ముభావంగా ఎందుకున్నారో, వాణ్ణి ఆప్యాయంగా ఎందుకు పలకరించలేదో తనకు అర్థంకాలేదు. తల్లిలేని పిల్లవాడు గదా, ఎప్పుడైనా భోజనానికైనా పిలుస్తారా? మంచి చెడ్డలు విచారించారా?

దత్తు మొదట్లో ఏమీ నోరు విప్పలేదు. తరువాత అన్నాడు: "నా వంటి అనామకులతో చిన్నమామయ్యకు పనేముంటుంది అత్తయ్యా? ఏ విషయంలోనూ వాళ్ళ హోదాకు సరితూగను. పట్నాల్లో బంధుప్రీతి తగ్గిపోతుందేమోలే!"

రాచిప్పలో పులుసు పెట్టి, పోతబోసిన పాతకంచుగిన్నెల్లో కూర, అన్నం వండి, బాదమాకుల విస్తట్లో ఆప్యాయంగా పెరుగూ, ఆవకాయతో భోజనం పెట్టిన శ్రీలక్ష్మి అత్తయ్య ముఖంలోకి చూడలేక దత్తు కళ్ళ నీళ్ళను శాసించుకోవటం హయగ్రీవం గమనించకపోలేదు. మనసు వికలం కాకుండా మాటమార్చి "ఎల్లుండి అమ్మమ్మ తద్దినం. సెలవు పెట్టు. ఇక్కడికే వచ్చి భోజనం చెయ్యి" అన్నాడు.

"దత్తుణ్ణితోడు తీసుకుని మీరు బ్రాహ్మణులకు చెప్పిరండి" అని శ్రీలక్ష్మి అన్నది.

"వీళ్ళకు ఇంటి పురోహితుడు లేడా ఏమిటి?"

"మరదలికి పూజా పునస్కారాల మీది ధ్యాస తక్కువేనేమో!"

అవును. పూజచేసి తులసికోటలో జలం పోద్దామని చూస్తే తనకు మొక్క ఎక్కడా కనిపించలేదు.

"మరి నువ్వు పార్థుడితో బ్రాహ్మల సంగతి హెచ్చరించక పోయావా?"

"మరిదికి ఈ తద్దినాలు గిద్దినాలు అంటే పెద్ద నమ్మకమున్నట్లు లేదు. మనం ఇక్కడ అన్నం పెడితే చచ్చినవాళ్ళు వచ్చి తినటమేమి టమ్మా అని నవ్వాడు. వాళ్ళది బస్తీ కాపరం. ఇవన్నీ కుదురుతాయో లేదో" అని ఆమె సమాధానం చెప్పింది.

మాతృయజ్ఞశేషం తమ్ముడితో జరిపిస్తేగాని పితృదేవతలు ఆశీర్వదించరని ఏ నమ్మకంతో ఇక్కడకు వచ్చాడో, తన గోత్ర పురుషుల ప్రవర ఉచ్చరిస్తే తమ్ముడికి శుభమవుతుందని ఆశించాడో— అదంతా నిరర్ధకమైన ఆశేనా? పుణ్యస్త్రీగా గతించిన తల్లి వర్ధంతినాడు కోడళ్ళిద్దరూ బ్రహ్మవేత్తల ఆశీర్వాదాలతో పునీతం చేసిన కొత్త చీరలు కట్టుకొంటారని ఇన్నాళ్ళూ కలలుగన్నాడు. మ్లాన వదనంతో మూగగా కూచున్న పెద్ద మామయ్యను దత్తుడు చూడలేక—"సికింద్రాబాదులో ఆనంద భవనానికి ఎదురుగా, హైదరాబాదులో చిక్కడపల్లిలో బ్రాహ్మలు దొరుకుతారు మామయ్యా. మనం మాట్లాడి వద్దాం పద" అన్నాడు— కాళ్ళకు చెప్పులు వేసుకొంటూ.

తన ఆకారం చూసి బ్రాహ్మడు ప్రశ్నించాడు:

"సరే తద్దినం అన్నారు గదా. నువ్వెంత ఇవ్వగలవ్?"

'ఇదేమిటి ఈ ఏకవచనం? ఈ బేరం? వైదిక ధర్మంలో వేద భూమిలో ఇవన్నీ ఉన్నాయా?'

"మీన మేషాలు లెక్క పెట్టుకొంటే కాదు. ఇది పెళ్ళిళ్ళ సీజను. బ్రాహ్మడు దొరకడమే గగనం. మంత్రం చెప్పినాయనకు ఏభై, భోక్తకు ముప్పై అయిదు. ఇచ్చుకోగలనంటే చెప్పు. తద్దినం గనక కనీసం ధోవతుల జత మామూలు."

హయగ్రీవం దత్తుడి ముఖం వంక చూశాడు.

"ఇక్కడంతే మామయ్యా."

ఖిన్నుడై పోయి తల్లి ప్రసన్నవదనాన్ని స్మృతికి తెచ్చుకొన్నాడు. "సర్జను పార్థసారథిగారిల్లు హిమాయత్‌నగర్లో- తెలుసా?"

"అయ్యో. చెప్పరేం. ఆగర్భశ్రీమంతులు. మరి వారి తల్లి ఆబ్దికమేమిటి? మీరు పది రూపాయల కోసం వెనకా ముందూ చూసుకో వటమేమిటి స్వామీ! షోడశ దానాలుగా ఇవ్వగల దాతలు. ఆటో చార్జీలు రానూపోనూ పది రూపాయలిచ్చిపొండి. తప్పక వస్తాం. యజుర్వేదు లేనా?"

గ్యాసు పొయ్యిజోలికి పోకుండా, వంటమనిషి ప్రమేయం లేకుండా శ్రీలక్ష్మి మడిగట్టుకొని అన్ని పదార్థాలూ వండింది. ఆవ పచ్చడి, అల్లం పచ్చడి, పచ్చి మిర్చితో దోసకాయ పచ్చడి ముక్కలూ, గారెలూ, మెత్తని బూరెలూ, పరమాన్నం, ములగకాడ చారూ—పిల్లలకు ఎంతో నచ్చాయి. రాకేష్ అటువంటి బూరెలెప్పుడూ తినలేదు. అల్లం పచ్చడిలో గారెలు నంజుకుంటుంటే అలకకు పెత్తల్లి మీద చాలా గౌరవం ఏర్పడింది. టి-వి.లో చూసిన పదార్థాలన్నీ అమ్మా, నాన్నా కోరకుండానే తెచ్చిపెట్టినా ఈ రుచి అద్భుతంగా ఉంది. ఆపరేషన్లున్నా యని పార్థుడు తనతోపాటు పంక్తిన భోజనం చేయలేకపోయినా, ఆలస్యంగా వచ్చి చల్లారిన పదార్థాలన్నీ ఆవురావురని తింటూ "వదినా! నీ చేతి వంట తిని ఎన్నాళ్ళయ్యింది!" అని చిన్నప్పటి చనువుతోనే వదినెను పలకరించినప్పుడు, మొదట బేరం చేసినా శ్రద్ధతో పురోహి తుడు శ్రాద్ధకర్మ నామాన్ని సార్థకం చేసినప్పుడు, విసినకర్రలూ, పాదరక్షలూ, గొడుగూ దానం అందుకుంటూ తమ వంశాన్ని దీవించి నప్పుడూ హయగ్రీవం కళ్లు చెమ్మగిల్లినాయి. అంతా అయి పింగాణి సింకులో చేయి కడుక్కొంటూ పార్థుడు—"ఇదంతా పెద్ద చాదస్తం వదినా, నువ్వేమైనా అనుకో. మామగారింట్లో ఎవ్వరూ నమ్మరు" అని అంటున్నప్పుడు తను కల్పించుకోబోయి శ్రీలక్ష్మి చూసిన చూపుకు

మళ్ళీ సర్దుకొని—ఇన్ని ఖరీదైన వస్తువులతో ఇంత పెద్ద భవనంలో ఇంద్రభోగం అనుభవిస్తున్నా తమ్ముడు పరంపరానుగతమైన జ్ఞాన మార్గాన్ని పూర్తిగా విసర్జించాడా? వాడి సంతానం ఈ జ్ఞానధారా మృతాన్ని రుచి కూడా చూడరు కాబోలు! పితృదేవతలు తమను క్షమిస్తారా!- అని మళ్ళీ క్రుంగిపోయాడు. దత్తుడు అంతా గమనిస్తూనే ఉన్నాడు. 'ఈ మహానగరపు కాంక్రీటు దుర్గమారణ్యంలో పెద్ద మామయ్య దారితప్పి గతి తోచక తిరగటానికా ఇంత దూరం వచ్చింది?' అనుకొన్నాడు.

మేడ కింది భాగంలోనే పార్థుడి సర్జరీ ఉంది. పాలరాతి నేలతో పెద్ద హాలు. ముందు ఆఫీసు గదులు. హాలు మధ్య రెండు పెద్ద గదుల్లో అటుపక్క ఒకటీ, ఇటుపక్క ఒకటీ రెండు ఆపరేషన్ థియేటర్లు. ఎక్స్‌రే యంత్రం ఉన్న గది పక్కనే అయిదారు గదులున్నాయ్. అవి పేషంట్లకు ఆస్పత్రి మంచాలు. తెల్లటి దుప్పట్లూ అన్ని వేపులా హిమవర్షంలాంటి చల్లని వాతావరణం. ముగ్గురు నర్సులూ, ఇద్దరు ఆయాలు. ఆఫీసు గదిలో ఎకౌంట్లు చూసే ఒక ముసలాయన. రోజుకు రెండు, మూడు పెద్ద ఆపరేషన్లు చేస్తారట. అవసరం వచ్చినప్పుడు పార్థుడికి సాయంగా ఇంకా ఇద్దరు జూనియరు సర్జన్లు కూడా వస్తుంటారు. ఎక్కౌంట్లు చూసే ముసిలాయన చెబుతున్నదంతా వింటున్నాడు హయగ్రీవం.

"గొప్ప హస్తవాసిగాదూ బాబూ తమ్ముడిగారిది! గవర్నమెంటు ఆస్పత్రిలో లాభంలేదని చప్పరించిన కేసులు కూడా ఇక్కడ నయమవుతాయి బాబూ! అదృష్టవంతులు. అందరికీ ఇటువంటి సోదరులు లభిస్తారా నాయనా?" 'అవును లంభించరు' అని తను మనసులోనే మురిసిపోయాడు. కాని, దత్తు చెప్పిన విశేషాలు ఈ వృద్ధుడు సహృదయంతో పాడిన వేదగానంలో అపశబ్దాలుగా వినవస్తూనే ఉన్నాయి.

తను మధ్యాహ్నం కునుకు తీసి మెట్ల వరండాలోకి తొంగి

చూసినప్పుడు ఎవరో మధ్యవయస్కుడు గడ్డం మాసిన దీనవదనంతో చేతులు నలుపుకొంటూ నిలబడి ఉండటం కనిపించింది.

"డాక్టరు బాబు నిద్ర లేచారా అయ్యా?"

'ఏం. ఇవ్వాళ పార్థుడికి ఆపరేషన్లు లేవా? ఇట్లా మధ్యాహ్నం విశ్రాంతిగా ఉండటం ఈ పది పన్నెండు రోజుల్లోనూ ఎప్పుడూ చూడ లేదే?' అని తను అనుకొంటూండగానే పార్థుడు లేచి వచ్చి వరండా దాకా నడిచి ఆగంతకుణ్ణి చూసి - డబ్బు తెచ్చావా?" అని ప్రశ్నించాడు.

"బాబూ..."

"ఏమీ లాభం లేదని చెప్పానా? అంత లేనివాడివైతే ధర్మాసుపత్రికి తీసుకెళ్ళు. ఇంకో డాక్టరైతే అయిదు వేలకు తక్కువ తీసుకోడు."

"అంత ఇచ్చుకోలేను బాబూ. ప్రస్తుతానికి వెయ్యి కూడగట్టుకు వచ్చాను. నా భార్యకు ప్రాణదానం చేస్తారని ఆశతో వచ్చాను. మీ కడుపున పుడతాను బాబూ" అని అతను వేడుకొంటున్నాడు.

"మళ్ళీ అదే మాటా? అసలిక్కడి కెందుకొచ్చావయ్యా? కిందకు పోయి మా గుమాస్తాతో మాట్లాడు. నీకు డబ్బు ఎక్కువో, నీ భార్య ప్రాణం ఎక్కువో అక్కడే తేల్చి చెప్పు. ఇట్లా మేడపైకి రాకూడదు" అని పార్థుడు గిరుక్కున వెనుదిరిగి తన పడకగదిలోకి వెళ్ళిపోయాడు. పార్థుడికా ఇంత కోపం! తనెప్పుడూ తమ్ముడిలో ఈ అలంకారం, అహంకారం చూడలేదు. కోపం రావలసిన ఆ ఆగంతకుడు మాత్రం వేదనతో తలమీద చేతులు పెట్టుకొని మెట్లమీద కూలబడిపోవటం చూసి హయగ్రీవం ఖిన్నుడై పోయి—

"బాబూ...ఆమె కేం జబ్బు?" అని ప్రశ్నించాడు.

"మూత్రపిండాల వ్యాధి నాయనా..."

"ఎంతడుగుతున్నాడు?"

"మూడు...వేలు..."

"ప్రాణ ప్రమాదమా?"

"ఏమని చెప్పేది బాబూ...ఈ వారంలో ఆపరేషను చెయ్యక పోతే ఇక నాకు దక్కదు బాబూ..." అతను భోరున ఏడవటం ప్రారంభించాడు.

* * *

సంతత జ్ఞానధారతో దానధారతో తమ ఇంటినీ, వంశాన్నీ పునీతం చేసి ధ్రువతారలుగా వెలుగుతున్న తన పూర్వీకులను తలుచు కున్నాడు హయగ్రీవం. అపర ధన్వంతరిగా అశేషజనానికి, ఆరోగ్యభిక్ష, ప్రాణదానం చేసినవాడు తన తండ్రి. ఆ తండ్రి పేరు నిలబెట్టి తన జన్మభూమి పేద ప్రజలకు సేవాంకితుడవుతాడనుకొన్న తమ్ముడు. మణియదారు వెంకటప్పయ్య పంతులుగారు నోటు, పత్రం, వడ్డీలేకుండా ఈ చదువుకు మొదటిసారి ధనం కూర్చి ఆశీర్వదించిన రోజు మొన్న మొన్నటిదే గదా!

ఈ తమ్ముడి వద్ద తన కొడుకు బుజ్జి చదువుకుంటాడని గదా ఇంత దూరం వచ్చింది? ఈ భయంకర ధనదాహంతో మానవత్వం మరుగునపడిన చోటనా తన కొడుకును ఉంచటం? వద్దు. నరసింహాచార్లు గారి వద్దవాడు కల్వం నూరుతూ, వస్తు గుణదీపిక మననంచేస్తూ, చరక సంహిత వల్లించుకొంటూ తిరిగి పితామహుడి అడుగుజాడల్లో నడవాలి. ఈ టి.వి. నాగరికతలో వాడు కూడా వంశధర్మం, నియతి విస్మరించక ముందే కదిలించాలి.

మర్నాడే హయగ్రీవం ప్రయాణమైనాడు. శ్రీలక్ష్మి ఎన్ని ప్రశ్నలు వేసినా తిరుగు చెప్పలేదు. మెళ్ళో స్టెతస్కోపు వేసుకొని పొద్దున్నే కిందికి పోబోతున్న పార్థుణ్ణి ఆపి—"ఇవ్వాళే మా ప్రయాణం" అన్నాడు.

"అదేమి టన్నయ్యా... ఇంత హఠాత్తుగా...?"

"నీకు డబ్బు చాలా అవసరంగా ఉన్నట్లుంది. నీ భాగం ఎకరం

నేనేమీ అన్యాక్రాంతంచేయలేదు. మంచి ధరలు పలుకుతున్నాయి. అది అమ్మి వచ్చే వారంలో పైకం పంపుతాను."

"నాకా...డబ్బా...అవసరమా? ఎవరన్నారు?"

"నిన్ననే ఒక ఆసామీ చెప్పాడు. మూడువేలకు తక్కువైతే ఆపరేషను జరగదు అని. డబ్బుకోసం ఇబ్బంది పడుతున్నవాడివి నాకెందుకు రాయలేదు?" అని తమ్ముడి ముఖం ఒక్క క్షణంచూసి, బుజ్జిగాడి వేలు లంకించుకొని, మెట్లమీద శ్రీలక్ష్మి కోసం వెనుకడుగు వెయ్యకుండా, హయగ్రీవం బయలుదేరాడు. ○

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక,
26-11-1986